యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)లోని వీర్ల చెరువుకు కాళేశ్వరం జలాలు రావడంతో చెరువు వద్ద మాజీ సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

వీర్ల చెరువుకు కాళేశ్వరం జలాలు

మాజీ సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

ఆత్మకూరు(ఎం), జనవరి 3 : అపర భగీరథుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మేడిగడ్డ ద్వారా 400 కిలోమీటర్ల దూరంలోని యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని వీర్ల చెరువుకు గోదావరి జలాలు తరలివచ్చాయి. దీంతో శుక్రవారం రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో రూ.1.30కోట్లతో మిషన్ కాకతీయ ద్వారా చెరువును అభివృద్ధి చేసి కట్టను పటిష్టంగా నిర్మించామని చెప్పారు. నేడు గోదావరి జలాలు గ్రామంలోని వీర్ల చెరువుకు రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. సొమ్ము ఒకడిది.. సోకు మరొకడిదిలా కాంగ్రెస్ నాయకులు గోదావరి జలాలను తామే తెచ్చామని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. మండలంలోని బిక్కేరు వాగుపై మోదుగుబావిగూడెం, టీ రేపాక, పారుపల్లి, కామునిగూడెం, కొరటికల్ గ్రామాల్లో చెక్‌డ్యామ్‌లు నిర్మించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, కోరె భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

కూనూరు చెరువు వద్ద

భువనగిరి కలెక్టరేట్ : కాళేశ్వరం, కొండపోచమ్మ, బస్వాపూర్ నృసింహ రిజర్వాయర్ల నుంచి కాల్వల ద్వారా వచ్చిన గోదావరి జలాలతో భువనగిరి మండలంలోని కూనూరు చెరువు అలుగుపోస్తున్నది. శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు అలుగు వద్ద పూజలు చేసి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్‌నేతలు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు కాళేశ్వరం నీళ్లు!

- **కొండపోచమ్మను కాదని మల్లన్నసాగర్ నుంచి 20 టీఎంసీల తరలింపు ప్రతిపాదనలు**
- **7300కోట్లతో గోదావరి ఫేజ్-2**
- **భారీగా అంచనా వ్యయం పెంపు**
- **ఖజానాకు భారం: నిపుణులు**
- **మంజీరా పాతలైన్ వెంట మరో పైపులైన్**
- **జలమండలి సమావేశంలో సీఎం నిర్ణయాలు**

20 టీఎంసీలు తరలించేలా మార్పులు

రాబోయే 25 ఏండ్ల అవసరాలను అంచనా వేసుకొని గ్రేటర్ హైదరాబాద్‌లో మంచినీటి సరఫరాకు సరిపడా మౌలిక సదుపాయాలకు ప్రణాళికను తయారు చేయాలని జలమండలి అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ సిటీ విస్తరణను దృష్టిలో పెట్టుకొని 2050 నాటికి పెరిగే జనాభా అవసరాలకు సరిపడేలా ప్లాన్ ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఇంటింటికీ తాగునీటితో పాటు సీవరేజీ ప్లాన్‌ను రూపొందించాలని, అవసరమైతే ఏజెన్సీలు, కన్సల్టెన్సీలతో అధ్యయనం చేయించాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన జలమండలి బోర్డు సమావేశంలో హైదరాబాద్ తాగునీటి అవసరాలకు నిర్దేశించిన గోదావరి ఫేజ్-2 ప్రాజెక్టును మల్లన్నసాగర్ నుంచి చేపట్టాలా? కొండపోచమ్మ సాగర్‌ను ఎంచుకోవాలా? అనే అంశంపై చర్చించారు.

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 'కాళేశ్వరంతో కొత్తగా ఒక్క ఎకరాకు కూడా నీళ్లందింది లేదు.. ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగింది' అంటూ నానా రచ్చ చేసి.. భారీ వరదకు ఒక్క పిల్లర్ కుంగితే దాన్ని ఎన్నికల అస్త్రంగా వాడుకొని.. అధికారంలోకి రాగానే మొత్తంగా ప్రాజెక్టునే పక్కకు పెట్టాలని చూసిన రేవంత్‌రెడ్డికి, ఇప్పుడు అదే కాళేశ్వరం దిక్కయింది. హైదరాబాద్ మహా నగరానికి మంచినీటిని అందించేందుకుగాను గోదావరి జలాల తరలింపులో కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించిన పథకాన్ని అమలు చేయడం ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌కు అనివార్యంగా మారింది. కేసీఆర్ ముందుచూపుతో కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్‌లోనే హైదరాబాద్ తాగునీటి అవసరాలతో పాటు మూసీ ప్రక్షాళనకు 30 టీఎంసీల గోదావరి జలాల కేటాయింపును జోడించారు. ఇప్పుడు దానికి అనుగుణంగానే హైదరాబాద్ నగరానికి కాళేశ్వర జలాలను అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. కాకపోతే కేసీఆర్ ప్రభుత్వం తక్కువ ఖర్చుతో కొండపోచమ్మసాగర్ నుంచి జలాల తరలింపునకు పథకాన్ని రూపకల్పన చేస్తే.. రేవంత్ ప్రభుత్వం పొంతనలేని సాంకేతిక హేతుబద్ధతతో పైప్‌లైన్ల పొడవు పెంచుకునేందుకు మల్లన్నసాగర్ నుంచి నీటిని తరలించేలా పథకాన్ని ప్రతిపాదించి ఖజానాపై వేల కోట్ల భారాన్ని మోపేందుకు సిద్ధమైంది. నాడు మల్లన్నసాగర్‌ను వ్యతిరేకించిన వాళ్లే ఇప్పుడు అదో జలభాండాగారం అనే ప్రాతిపదికన హైదరాబాద్ మంచినీటి పథకాన్ని చేపడుతున్నారు. కొండపోచమ్మ సాగర్ నుంచి రూ.1,060 కోట్లతో పది టీఎంసీల గోదావరి జలాలను నగరానికి తరలించేందుకు అవకాశమున్నది. కాంగ్రెస్ సర్కారు మల్లన్నసాగర్‌ను తెరపైకి తెచ్చి తొలుత 15 టీఎంసీల తరలింపునకు రూ.5,560 కోట్ల అంచనా వ్యయాన్ని నిర్ణయించింది. తాజాగా 20 టీఎంసీల తరలింపు అంటూ అంచనా వ్యయాన్ని ఏకంగా రూ.7,300 కోట్లకు పెంచినట్టు తెలిసింది. కేవలం కాగితాల్లోనే అంచనా వ్యయాన్ని వేల కోట్లు పెంచుకుంటూ పోతూ ఖజానాపై ప్రభుత్వం భారీభారం మోపుతున్నదని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా పైపులైన్ల పొడవు పెంచేందుకే జలాల తరలింపు పరిమాణాన్ని పెంచి కొండపోచమ్మ నుంచి మల్లన్నసాగర్‌కు డిజైన్ మార్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జలమండలి అధికారుల మొర

జలమండలి ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఏడాది నుంచి సంస్థకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులు మంజూరు కావడం లేదని అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎంకు మొర పెట్టుకున్నారు. జలమండలి ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలు, తాగునీటి సరఫరా నిర్వహణ ఖర్చులకే సరిపోతున్నదని వివరించారు. ఆదాయ, వ్యయాలు ఆశాజనకంగా లేవని, వీటిని అధిగమించేందుకు ఆర్థిక శాఖ సమన్వయంతో తక్షణ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని సీఎం సూచించారు. జలమండలి సొంత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని చెప్పారు. ఇప్పటికే 20 వేల లీటర్ల నీటిని సిటీలో ఉచితంగా సరఫరా చేస్తున్నందున, ఇతర కనెక్షన్ల నుంచి రావాల్సిన నల్లా బిల్లు బకాయిలు క్రమం తప్పకుండా వసూలయ్యేలా చూడాలని చెప్పారు. జలమండలి కొత్తగా చేపట్టే ప్రాజెక్టులకు నిధులు సమకూర్చుకోవాలని, తక్కువ వడ్డీతో రుణాలు తెచ్చుకునే ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలని సూచించారు. అందుకు డీపీఆర్లు తయారు చేయించాలని చెప్పారు.

జల్ జీవన్ మిషన్ వైపు అడుగులు వేద్దాం

ప్రస్తుతం హైదరాబాద్ సిటీలో ఉన్న జనాభాకు సరిపడే తాగునీటిని సరఫరా చేస్తున్నామని, మొత్తం 9,800 కిలోమీటర్ల డ్రింకింగ్ వాటర్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ద్వారా 13.79 లక్షల కనెక్షన్లకు నీటిని సరఫరా చేస్తున్నట్టు సీఎంకు అధికారులు నివేదించారు. 1965 నుంచి సిటీలో పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్న మంజీరా పైపులైన్లకు కాలం చెల్లిందని, రిపేర్లు వస్తే దాదాపు 15 రోజులు నీటి సరఫరా నిలిచిపోతున్నదని వివరించగా పాత లైను వెంట అధునాతన లైన్ నిర్మించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అవసరమైతే జల్ జీవన్ మిషన్ ద్వారా నిధులు తెచ్చుకునేందుకు వీలుగా ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని సూచించారు. సమావేశానికి బోర్డు చైర్మన్ హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షత వహించారు. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

మేడిగడ్డ ఇంజినీర్లపై క్రమశిక్షణా చర్యలు

హైదరాబాద్, జనవరి3 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బరాజ్ పనులు పూర్తికాకముందే, పూర్తయినట్టు నిర్మాణ ఏజెన్సీకి ధ్రువపత్రాలను జారీచేసిన ఎస్ఈ, ఈఈపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులను జారీ చేసింది. మేడిగడ్డ బరాజ్‌ను ఎల్అండ్‌టీ ఏజెన్సీ నిర్మించిన విషయం తెలిసిందే. బరాజ్ కుంగుబాటు తర్వాత దాని పునరుద్ధరణ బాధ్యత నిర్మాణ ఏజెన్సీదేనని తెలుపగా, తమకేమీ సంబంధం లేదని సదరు ఏజెన్సీ వెల్లడించింది. అప్పటి ఎస్ఈ రమణారెడ్డి, ఈఈ తిరుపతిరావు ప్రాజెక్టు కంప్లీషన్ సర్టిఫికెట్‌ను కూడా ఇచ్చారని ఏజెన్సీ తెలిపింది. నిబంధనలకు లోబడే ఆ సర్టిఫికెట్ ఇచ్చామని సదరు ఎస్ఈ, ఈఈలు వెల్లడిస్తున్నారు. ఈ అంశంపై విచారించిన విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ తన నివేదికను ఇప్పటికే సమర్పించింది. మరోవైపు 3 బరాజ్‌లపై కాళేశ్వరం కమిషన్ విచారణ కొనసాగుతున్నది. కంప్లీషన్ సర్టిఫికెట్ జారీపై 10 రోజుల్లో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని, లేదంటే సదరు ఎస్ఈ, ఈఈపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్‌శాఖ అధికారులను తాజాగా ప్రభుత్వం ఆదేశించింది.

ప్రాజెక్టుల రివైజ్డ్ ఎస్టిమేట్ల ఆమోదం

హైదరాబాద్ జలసౌధలో శుక్రవారం నిర్వహించిన స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ (ఎస్ఎల్ఎస్సీ) సమావేశంలో వివిధ ప్రాజెక్టుల రివైజ్డ్ ఎస్టిమేట్లను ఆమెదించారు. టెండర్లను పొడిగిస్తూ కూడా నిర్ణయం తీసుకున్నారు. ఈఎన్సీ అనిల్‌కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి, ఏమ్మార్పీ, దేవాదుల ప్రాజెక్టుల రివైజ్డ్ ఎస్టిమేట్లపైనా చర్చించారు. వివిధ ప్రాజెక్టుల టెండర్లను పొడిగింపుపై కూడా అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఆయా అంశాలను ప్రభుత్వానికి నివేదించి, అనుమతులు పొందాలని తుదకు నిర్ణయించారు.

నిధులడిగితే.. బెదిరింపులా?

- **శుభాకాంక్షలు చెప్పేందుకు వెళ్లి అవాక్కైన ఎమ్మెల్యేలు**
- **ప్రజల్లోకి వెళ్లటం లేదంటూ ఎమ్మెల్యేలపై ముఖ్యనేత అసహనం**
- **ఏ మొఖం పెట్టుకొని వెళ్లాలంటూ శాసనసభ్యుల ఆవేదన**
- **గెలిచినప్పటి నుంచి రూపాయి అభివృద్ధి పనులు లేవని అసహనం**
- **50 కోట్లు నియోజకవర్గం ఫండ్ ప్రకటించినా దిక్కులేదని ఆందోళన**

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, నియోజకవర్గం అభివృద్ధికి నిధులు అడుగుదామని ఇంటికి వచ్చిన ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి ఉల్టా క్లాస్ పీకి పంపినట్టు సమాచారం. నిధులు అడుగుదామని ఎమ్మెల్యేలు నోరు తెరిచేలోపే ముఖ్యమంత్రి అందుకొని, ముగ్గురు మంత్రులు, 35 మంది ఎమ్మెల్యేల పనితీరు ఏమాత్రం బాగాలేదని, వారు తమ నియోజకవర్గానికి, ప్రజలకు దూరంగా ఉంటున్నారని అసంతృప్తి వ్యక్తంచేసినట్టు తెలిసింది. అందరి ప్రోగ్రెస్ రిపోర్టులు తన దగ్గర ఉన్నాయని చెప్పడంతో ఎమ్మెల్యేలు అవాక్కైనట్టు సమాచారం. కొందరు ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లటం లేదని, తమ బంధువర్గాలను ముందుపెట్టి నియోజకవర్గాల్లో పాలన కొనసాగిస్తున్నారని సీఎం హెచ్చరించినట్టు తెలిసింది. తన వద్ద నిఘా వర్గాల నివేదికలు, రాజకీయ వ్యూహకర్త రహస్య సర్వే నివేదికలు ఉన్నాయని, అందరినీ ఒకసారి పిలిచి నివేదికలు బయట పెడతానని చెప్పినట్టు తెలిసింది. దీంతో.. గెలిచిననాటి నుంచి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా అభివృద్ధి నిధులు ఇవ్వలేదు కానీ, ఉల్టా ప్రజల్లోకి వెళ్లటం లేదని తమను నిలదీయటం ఏమిటంటూ ఎమ్మెల్యేలు మండిపడుతున్నారు. ఏం సాధించామని ప్రజల్లోకి వెళ్లి చెప్పుకోవాలని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

మాకిచ్చిన హామీలు కూడా నెరవేరలేదు

మౌలిక వసతుల కల్పన, గ్రామాల్లో మురికి కాల్వల నిర్మాణం, చెడిపోయిన రోడ్ల మరమతులు, సీసీ రోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనుల కోసం ఒక్కొక్క నియోజకవర్గానికి రూ.50 కోట్ల చొప్పున నిధులు ఇస్తామని గతంలో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యే ఒకరు ఆవేదన వ్యక్తంచేశారు. గత ఆగస్టులో కొత్త రహదారుల నిర్మాణం, గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం రూ.50 కోట్ల విలువైన అంచనాలతో ప్రతిపాదనలు పంపాలని కోరారని, తాను నిజమేనని నమ్మి అప్పటికప్పుడు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించానని కానీ ఇంతవరకు ఆ మాటే ఎత్తడం లేదని సదరు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే తన అనుభవాన్ని వివరిస్తూ.. అత్యంత వెనుకబడిన తన నియోజకవర్గానికి తక్షణమే రూ.200 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపగా.. ఆర్ అండ్‌బీ, పంచాయితీరాజ్‌శాఖ అధికారులు పిలిపించి ఆ ప్రతిపాదనలను రూ.50 కోట్లకు కుదించాలని చెప్పారని అన్నారు. రెండు మూడు రాత్రులు కసరత్తు చేసి రూ.70 కోట్లకు కుదించామని, కానీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా రాలేదని అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్, రహదారులు-భవనాల శాఖకు రూ.12 వేల కోట్లు మంజూరు చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది కానీ ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదని వరంగల్ జిల్లాకు చెందిన ఓ యువ ఎమ్మెల్యే వాపోయారు. గ్రామాలకు ధైర్యంగా వెళ్లి కనీస పనులకు శంకుస్థాపనలు చేసే పరిస్థితి లేదని ఖమ్మం జిల్లా నుంచి కొత్తగా గెలిచిన ఎమ్మెల్యే ఒకరు 'నమస్తే తెలంగాణ' ప్రతినిధితో ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు అభివృద్ధి నిధులు లేకుంటే.. కనీసం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పట్టుకొనైనా గ్రామాల్లోకి వచ్చేవారని, తమకు ఆ చెక్కులు కూడా అందటం లేదని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తొలిసారి గెలిచిన ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పి, నిధులు అడుగుదామని వెళ్లిన తమకు సర్వే నివేదికలు అంటూ భయపెట్టడం సరైన పద్ధతి కాదని వారు అంటున్నారు. ప్రభుత్వమే నిధులు ఇవ్వనప్పుడు తామేం చేయగలమని, తమను బద్నాం చేస్తే ఏమొస్తుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఏం సాధించామని వెళ్లాలి?

ఆరు గ్యారంటీల అమలు కాలేదు, జాబ్ క్యాలెండర్, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, చేయూత, రూ 4 వేల నిరుద్యోగ భృతి, పెళ్లి చేసుకున్న ఆడబిడ్డకు తులం బంగారం, రూ. లక్ష ఏ ఒక్క పథకం కూడా ఇప్పటికీ ముందుకు సాగకపోవడంతో తాము ప్రజల్లోకి వెళ్లలేకపోతున్నామని ఎమ్మెల్యేలు ఆవేదన చెందుతున్నారు. 'హామీ ఇచ్చిన మేరకు సంక్షేమ పథకాలు అమలు జరిగి ఉంటే.. ఎమ్మెల్యేలుగా వారి వద్దకు వెళ్లి పథకాలు అందాయా? లేదా? అని అడుగుతూ.. ప్రజల్లోనే ఉండే వాళ్లం. గ్రామంలో ఓ ఐదు మందో.. పది మందో మాకు ఫలాన పథకం అందలేదని ఫిర్యాదు చేస్తే.. అక్కడే తాసీల్దారునో, ఎంపీవోనో పిలిపించి.. ఇగో.. మా వాళ్లకు అర్హత ఉన్నా కూడా పథకం అందలేదు ఎందుకు? అని నిలదీస్తే.. జనంలో మాకింత మంచి పేరు వచ్చేది. కానీ మేమే ఒక్క పథకం అమలు చేయనప్పుడు ప్రజల్లోకి ఎట్టా పోవాలి?' అని నల్లగొండ జిల్లాకు చెందిన ఎమ్మెల్యే ఒకరు వాపోయారు.

తుంగతుర్తి మండలం రామన్నగూడెంలో వేరుశనగ పంటకు బిందెతో నీళ్లు పోస్తున్న రైతు భూక్యా సుందర్

నీళ్లు లేక.. పంట రాక!

సూర్యాపేట, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరం జలాలు వచ్చిన తర్వాత తుంగతుర్తి నియోజకవర్గంలో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఏటా 1,500 ఎకరాల్లో ఆరుతడి పంటలు వేస్తూ వచ్చారు. ఈ సారి 850 ఎకరాల్లో పంట వేశారు. బీఆర్ఎస్ సర్కారులో కాళేశ్వరం జలాలు యాసంగికి డిసెంబర్ తొలివారంలో విడుదల చేయగా, ఈసారి జనవరిలో విడుదల చేశారు. పంటలకు నీళ్లు అందడం లేదు. పల్లి రైతులు బోర్లతో పంట పండించుకున్నా, పంట చేతికొచ్చే సమయంలో పల్లి కాయ తీయడం కష్టంగా మారింది. రామన్నగూడెంలో రైతు భూక్యా సుందర్ బోర్ల నుంచి నీరు తెచ్చి పంటకు చల్లుతూ పంటను కాపాడుకున్నాడు.

ఎండుతున్న నార్లు.. రైతుల దిగాలు

నాగిరెడ్డిపేట, జనవరి 3: పోచారం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల ప్రారంభించక పోవడంతో కళ్లముందే వాడిపోతున్న నారును చూసి రైతుల హృదయాలు తల్లడిల్లుతున్నాయి. కామారెడ్డి జిల్లా పోచారం ప్రాజెక్టు నుంచి ఆయకట్టు కింద రైతులు నార్లు పోసుకున్నారు. డిసెంబర్‌లోనే నీటిని విడుదల చేయాల్సి ఉండగా, ఇంకా ప్రారంభించ లేదు. దీంతో నాగిరెడ్డిపేట శివారులోని పోచారం ప్రధాన కాలువ కింద పోసిన తుకాలు ఎండిపోతున్నాయి. కండ్ల ముందే ఎండుతున్న వరి నారును కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. ట్యాంకర్‌తో నీటిని తెచ్చి నారుమళ్లు తడుపుకొంటున్నారు. డబ్బులు పెట్టి ట్యాంకర్ నీటితో నారును కాపాడుకుంటున్నామని, అధికారులు వెంటనే పోచారం నీటిని విడుదల చేయాలని రైతు బడిగె లస్మయ్య కోరారు.

రైతుల నెత్తిన గ్రీన్‌ఫీల్డ్ పిడుగు!

మొదటిపేజీ తరువాయి...

విడతలో కొంగరకలాన్ ఓఆర్ఆర్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర 300 అడుగుల రోడ్డు వేయడానికి 449 ఎకరాలను గుర్తించి సర్వే పూర్తిచేశారు. త్వరలోనే ఆ భూములకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఆయా భూములు ప్రస్తుత మార్కెట్‌లో కోట్ల రూపాయల విలువ చేస్తుండగా, ప్రభుత్వం మార్కెట్ విలువ ప్రకారమే పరిహారం ఇస్తామని చెప్పుండటంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తొలి విడతలో ఫిరోజ్‌గూడ, కొంగరకలాన్, కొంగరకుర్దు, లేమూర్, తిమ్మాపూర్, రాచులూరు, గుమ్మడవెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట మీదుగా రోడ్డు నిర్మాణానికి ఏర్పాట్లు చేశారు. రెండో విడతలో కూడా రోడ్డు కోసం భూసేకరణకు ప్రభుత్వం సిద్ధమైంది. నోటిఫికేషన్ జారీచేసిన ప్రభుత్వం మొత్తం 4,725 మంది రైతుల నుంచి 554 ఎకరాల భూసేకరణ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నది. ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్న ప్రాంతాల్లో భూక్రయ, విక్రయాలు, అభివృద్ధి పనులను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అభ్యంతరాలుంటే రెండు నెలల్లో లిఖితపూర్వకంగా కలెక్టర్‌కు తెలియజేయాలని సూచించింది.

తొలి విడత సర్వేలో అడుగడుగునా అడ్డంకులు

ప్రభుత్వం గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం తొలి విడత చేపట్టిన భూసేకరణకు రైతుల నుంచి అడుగడుగునా అవరోధాలు ఏర్పడ్డాయి. సర్వే పనులను రైతులు అడ్డుకున్నారు. దీంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున పోలీసులను మోహరించి రైతులను నిర్బంధించి సర్వే చేపట్టింది. మద్దతుగా తరలివచ్చిన రాజకీయ నాయకులను ఎక్కడికక్కడ కట్టడి చేశారు. పోలీసుల నిర్బంధం మధ్య అధికారులు తొలి విడత సర్వేను పూర్తిచేశారు. రెండో విడత సర్వేను కూడా అడ్డుకోవాలని రైతులు కార్యచరణ సిద్ధం చేసుకుంటున్నారు. భూమికి భూమి ఇచ్చిన తర్వాతే తమ భూములను తీసుకోవాలని, లేని పక్షంలో సర్వేను ముందుకు సాగనివ్వబోమని రైతులు తేల్చిచెప్తున్నారు. పచ్చని పంటపొలాల నుంచి గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు వేయడం ఏమిటని, తమ కొద్దిపాటి భూమిని రోడ్డు కోసం తీసుకుంటే తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రెండువేల కోట్లు మంజూరు!

కొంగరకలాన్ ఓఆర్ఆర్ నుంచి ఆకుతోటపల్లి వరకు నిర్మించనున్న 41 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం ప్రభుత్వం తొలి విడతలో రూ.2,000 కోట్లు మంజూరు చేయడానికి పచ్చజెండా ఊపినట్టు తెలిసింది. రెండు విడతల రోడ్డు కోసం భూసేకరణ పూర్తయిన వెంటనే రైతులకు పరిహారం అందించి రోడ్డు పనులు ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ఇందులో భాగంగా రెండు విడతల్లో 1,003 ఎకరాలకు పరిహారంతోపాటు రోడ్డు పనులు చేపట్టడం కోసం ఈ నిధులు వెచ్చించే యోచనలో ఉన్నట్టు సమాచారం.

సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 3 : ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించి వెంటనే సౌకర్యాలు కల్పించాలంటూ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ఎదుట శుక్రవారం రెండో రోజూ విద్యార్థులు ధర్నా నిర్వహించారు. డీఎంఈ డాక్టర్ వాణి కళాశాలకు చేరుకుని ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌తో సమావేశమయ్యారు. విద్యార్థులతో రెండు గంటలపాటు చర్చించారు. సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని, పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

రెండో రోజుకు చేరిన జీసీసీ హమాలీల సమ్మె

దమ్మపేట/భద్రాచలం, జనవరి 3 : 2024 అక్టోబర్‌లో జరిగిన జీసీసీ, సివిల్ సప్లై రేట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హమాలీలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట, భద్రాచలం మండల కేంద్రాల్లో చేపట్టిన సమ్మె శుక్రవారం రెండో రోజుకు చేరింది. సమ్మెకు సీపీఎం, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ మద్దతు తెలిపింది.

మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

రెండు ఆటోలను ఢీకొన్న కారు • నలుగురు దుర్మరణం

గుమ్మడిదల, జనవరి 3: మెదక్-బాలానగర్ రహదారిపై నల్లవలి అటవీ ప్రాంతంలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డుప్రమాదంలో నలుగురు మృతిచెందారు. జిన్నారం సీఐ నయిమోద్దీన్ వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 10 గంటలకు నర్సాపూర్ నుంచి స్విఫ్ట్‌డిజైర్ కారు (ఏపీ28డీవీ4801), ప్యాసింజర్ ఆటో (టీజీ 35టీ 0168) నర్సాపూర్ నుంచి బాలానగర్ జాతీయ రహదారి వైపు బయల్దేరాయి. గుమ్మడిదల మండలం నల్లవల్లి అటవీ ప్రాంతంలోని మేడాలమ్మ ఆలయం సమీపంలో కారు అతివేగంగా దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న (టీఎస్35 టీఏ 2586) ప్యాసింజర్ ఆటోను ఢీకొట్టింది. కారు వెనుక వస్తున్న ప్యాసింజర్ ఆటో (టీజీ35టీ 0168) కారును ఢీకొట్టింది. దీంతో ఆటోల్లో ప్రయాణిస్తున్న మెదక్ జిల్లా పేరూరు గ్రామానికి చెందిన పాపగారి మనీషా(26), నర్సాపూర్ మండలం రుస్తుంపేటకు చెందిన ఐశ్వర్య(19), ఎల్లారెడ్డిగూడ తండాకు చెందిన ప్రవీణ్(30) ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. మరో ఐదుగురికి తీవ్రగాయాలు కాగా సూరారం మల్లారెడ్డి దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో కౌడిపల్లి మండలానికి చెందిన అనుసూయ(62) మృతిచెందింది. ఆటోడ్రైవర్ సంతోష్ పరిస్థితి విషమంగా ఉండటంతో గాంధీ దవాఖానకు తరలించారు. కారులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నయిమోద్దీన్ తెలిపారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పలువురు నాయకులు బాధిత కుటుంబాలను ఓదార్చారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోండి..

బీచుపల్లి గురుకుల విద్యార్థుల ఆందోళన

ఎర్రవల్లి చౌరస్తా, జనవరి 3 : 'ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు.. అతడిపై చర్యలు తీసుకోండి'.. అంటూ గురుకుల విద్యార్థులు శుక్రవారం జోగుళాంబ గద్వాల జిల్లా బీచుపల్లి గురుకుల గేటు ఎదుట విద్యార్థులు బైఠాయించి ధర్నా చేపట్టారు. విద్యార్థుల పట్ల గురుకుల ప్రిన్సిపాల్ అనుచితంగా ప్రవర్తిస్తున్నారని, మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని వాపోయారు. దీనిపై గతంలోనూ బీచుపల్లి స్కూల్ నుంచి గద్వాల కలెక్టరేట్ వరకు 19 కిలోమీటర్లు 150 మంది పాదయాత్ర చేపట్టినట్టు గుర్తు చేశారు. నాడు ప్రిన్సిపాల్‌పై విచారణకు కలెక్టర్ ఆదేశించారని, గురువారం అధికారులు గురుకులాన్ని సందర్శించారన్నారు. కాగా శుక్రవారం పాఠశాలకు ప్రిన్సిపాల్ రావడంతో ధర్నాకు దిగినట్టు తెలిపారు. ఇటిక్యాల ఎస్సై ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థులకు నచ్చజెప్పారు. వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించి పాఠశాలలోకి వెళ్లారు.

భూములు అమ్మలేం.. కుదువ పెడదాం

మొదటిపేజీ తరువాయి...

రంగం పరిస్థితి బాగాలేదని ప్రభుత్వం పరోక్షంగా ఒప్పుకున్నట్టు స్పష్టమవుతున్నది. అందుకే హైదరాబాద్ చుట్టూ ఉన్న భూములను అమ్మడం కన్నా కుదువ పెట్టడంపైనే దృష్టిసారించిందని చర్చ జరుగుతున్నది.

అనుకున్నదొక్కటీ.. అయిందొక్కటి!

భూముల అమ్మకంతో నిధులు సమీకరించాలని, వాటితో ప్రధాన హామీలు నెరవేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావించింది. కానీ కాంగ్రెస్ అధికారం చేపట్టగానే రియల్ ఢమాల్ అయింది. వ్యాపారవర్గాల్లో నమ్మకం సన్నగిల్లింది. అంతేకాకుండా ఆదాయమార్గాలపై ప్రభుత్వం దృష్టి పెట్టడంలేదని, అసమర్థ విధానాలతో రియల్ ఎస్టేట్ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని ఆర్థిక నిపుణులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. రియల్ ఎస్టేట్‌కు కీలకమైన హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో హైడ్రా కారణంగా అమ్మకాలు కుప్పకూలాయని అధ్యయనాలు స్పష్టంచేస్తున్నాయి. ప్రభుత్వ విధానాలతో కొత్త పెట్టుబడులు రాకపోగా, ఉన్న పరిశ్రమలు వెళ్లిపోతున్నాయని పారిశ్రామికవర్గాలు చెప్తున్నాయి. దీంతో రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్ధత నెలకొన్నది. ఇలాంటి సమయంలో భూములు వేలం వేస్తే అనుకున్న ధర పలకదని ప్రభుత్వ పెద్దలకు నిపుణులు, అధికారులు తేల్చిచెప్పినట్టు తెలుస్తున్నది.

అప్పుడు రూ.100 కోట్లు

మౌలిక రంగాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణ, సమగ్రాభివృద్ధిపై కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు, విధానాలతో రాష్ట్రంలో భూములకు మంచి గిరాకీ ఏర్పడింది. పదేండ్లలోనే భూముల ధరలు దాదాపు పదిరెట్లు పెరిగాయి. హైదరాబాద్ పరిధిలో అబ్బురపడే ధర పలికింది. 2023 ఆగస్టులో కోకాపేటలోని నియోపొలిస్ ఫేజ్-2 వేలంలో ఎకరం భూమి రికార్డు స్థాయిలో రూ.100 కోట్లు పలికి, ఎస్టేట్ రంగంలోనే సరికొత్త చరిత్ర సృష్టించింది. ప్రభుత్వం రూ.35 కోట్లకు బిడ్డింగ్ ప్రారంభిస్తే మూడు రెట్లు ఎక్కువ ఆదాయం వచ్చింది. అత్యల్పంగా వచ్చిన ధరనే ఎకరానికి రూ.67.25 కోట్లు అంటే అప్పటి హవా అర్థం చేసుకోవచ్చు.

ఇప్పుడు అందుకోవడం కష్టం

రాష్ట్రవ్యాప్తంగా భూముల అమ్మకంపై కాంగ్రెస్ ప్రభుత్వం అధ్యయనం చేయించింది. హెచ్ఎండీఏ పరిధిలో మొదటి దశలోనే 400 ఎకరాలు విక్రయించాలని ప్లాన్ చేసింది. కానీ నివేదికలు చూసి ప్రభుత్వ పెద్దలు నిట్టూర్చినట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ పరిస్థితి బాగాలేదని ప్రభుత్వాన్ని నిపుణులు హెచ్చరించినట్టు తెలుస్తున్నది. ఇప్పుడు వేలం వేస్తే అంచనా కంటే 40 శాతం తక్కువ ఆదాయం వచ్చే అవకాశమున్నదని అధికారులు తేల్చిచెప్పారట. వేలానికి వెళ్లిన తర్వాత అలాంటి పరిస్థితి ఎదురైతే భూముల ధరలు పడిపోయినట్టు ప్రభుత్వమే ఒప్పుకున్నట్టు అవుతుందని, తద్వారా రాష్ట్రవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలుతుందని స్పష్టంచేశారట. దీంతో ప్రభుత్వం భూముల అమ్మకం నిర్ణయాన్ని పక్కనపెట్టిందని, భూములను బ్యాంకులను తనఖా పెట్టాలని నిర్ణయం తీసుకున్నదని తెలుస్తున్నది. ఈ మేరకు ఇప్పటివరకు దాదాపు 400 ఎకరాలను తనఖా పెట్టారని, మరో 400 ఎకరాలను సిద్ధంచేశారని సమాచారం.